


# నవభూమి

## జిల్లా అనుబంధం

29 మార్చి ,2025 శనివారం పేజీలు:8

www.epaper.navabhoomi.in

# ప్రణాళికాబద్ధంగా ప్యాక్స్ పని చేసే విధంగా చర్యలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రైతులకు ప్రత్యామ్నాయంగా అదనపు ఆదాయ మార్గాలు అన్వేషించాలి
- ప్యాక్స్ సభ్యత్వం యాక్టివ్‌గా ఉండేలా చర్యలు
- జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 28: ప్రణాళికాబద్ధంగా ప్యాక్స్ పని చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు ఆశించిన రీతిలో పని చేయడం లేదని అన్నారు. రైతులకు సరైన సమయంలో తక్కువ వడ్డీతో పెట్టుబడి అందించడం, రైతుల నుంచి డిపాజిట్ సేకరణ జరగాలని అన్నారు. ప్యాక్స్ లో ఉన్న సభ్యులు యాక్టివ్ గా ఉండేలా చూడాలని అన్నారు. ప్యాక్స్ రైతులకు ఉపయోగపడే నూతన కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళిక చేయాలని అన్నారు. జిల్లాలో ఎన్ని ప్యాక్స్ సరిగ్గా పని చేస్తున్నాయో వివరాలు సేకరించి రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్యాక్స్ ద్వారా రైతులకు నూతన సాగు పద్ధతులు, ఫిష్ ఫార్మింగ్, ఫిష్ పాండ్స్, ప్రత్యామ్నాయ పంటల సాగు వంటి అంశాల పై అవగాహన కల్పించేందుకు సమావేశాల నిర్వహణ షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. సింగరేణి మండలంలో కోతుల బాధ అధికంగా ఉందని, వీటి పరిష్కారానికి రైతులు ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై స్టడీ చేయాలని అన్నారు. రైతులకు ఇతర ఆదాయ మార్గాలు ఎలా కల్పించాలి అనే అంశంపై కూడా ప్యాక్స్ పని చేయాలని అన్నారు. ఏప్రిల్ నెల నుంచి ప్రణాళికాబద్ధంగా ప్యాక్స్ పని చేయాలని అన్నారు. పశు సంవర్ధక, మత్స్య శాఖ ద్వారా రైతులకు ప్రత్యామ్నాయంగా ఆదాయం లభించేలా పథకాలను రూపొందించాలని అన్నారు. రెగ్యులర్ గా ప్యాక్స్ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద 3 ప్యాక్స్ ద్వారా వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ కు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. రైతుల ఉత్పత్తి మార్కెటింగ్ సౌకర్యం కల్పించే అంశంలో కూడా ప్యాక్స్ పని చేయాలని అన్నారు. ప్యాక్స్ లోని యాక్టివ్ సభ్యులను తీసుకొని ఎఫ్.పి.ఓ. ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ ఎల్. సుజిత్ కుమార్, జిల్లా కో ఏ ఆపరేటివ్ అధికారి జి. గంగాధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి జి. శివ ప్రసాద్, జిల్లా పశు సంవర్ధక శాఖ ఏ.డి. డాక్టర్ కే. శ్రీరమణి, డిసిసిబి సిఈఓ ఎన్.వి. ఆదిత్య, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# మధుర జ్ఞాపకాలు

## మననం చేసుకున్న కలెక్టర్, ఎస్పీ






కొత్తగూడెం మార్చి 28 నవభూమి ప్రతినిధి: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన దావత్ ఇఫ్తార్ కు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ బి రోహిత్ రాజు, రంజాన్ నెలలో తమ స్నేహితులతో గడిపిన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ బాల్యంలో రంజాన్ సందర్భంగా ముస్లిం స్నేహితులతో గడిపే వాడినని, ఏదైనా సంతోషం కలిగినప్పుడు అల్హందులిల్లాహ్ అనే పదం చెప్పాలని నేర్పించారని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఆ జ్ఞాపకాలు ఎంతో మధురమని పొరపచ్చాలు లేకుండా బాల్యంలో స్నేహితులతో గడిపే వాడిని అన్నారు. అల్లాకా షుక్రియా అంటూ ముగించారు. ఆయన హిందీలో మాట్లాడి ఆకట్టుకున్నారు. రంజాన్ నెలలో రంజాన్ బక్రీద్ సందర్భంగా ఇతర పండగలప్పుడు ముస్లిం సోదరులతో గడిపిన బాల్యాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్, బక్రీద్, ఆయతే కరిమా పఠనం సందర్భాల్లో ముస్లిం స్నేహితులతో కలిసి వారి ఇళ్లకు వెళ్లి సరదాగా గడిపే సంతోషాన్ని అందరం కలిసి పంచుకునే వాళ్ళమని గుర్తు చేశారు.రాజ్యాంగం మనకు గొప్ప వరం అందరం కలిసి మెలిసి ఉండడం కలిసి జీవించడం అనేది ప్రజాస్వామ్యానికి పెద్ద ఆ భరణం అని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు

# ప్రజల మధ్య ఐక్యత భావం పెంచుతున్న ఇఫ్తార్

- రంజాన్ మాస స్ఫూర్తితో రాగద్వేషాలు దూరం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- కొత్తగూడెం క్లబ్బులో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్







కొత్తగూడెం మార్చి 28 నవభూమి ప్రతినిధి: మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని, అందుకు పండుగలు దోహదపడతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్బులో కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలా స్థాయి ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక నమాజు అనంతరం ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతాభావం పెంచుతున్నాయని అన్నారు. ప్రజల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ ప్రభుత్వం పండుగల సమయాల్లో అధికారిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో శాంతిని నెలకొల్పుతుందని, ప్రజల, కులాలు, మతాల మధ్య గద్వేషాలను దూరం చేస్తుందన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు వారి కుటుంబాలతో పాటు సమాజంలో శాంతిని, ప్రేమను నెలకొల్పడానికి, సోదర భావం, దాతృత్వాన్ని పెంచడానికి దోహదపడుతుందని, ప్రజాస్వామ్య దేశంలో కులమతాలకతీతంగా మతసామరస్యాన్ని చాటి చెబుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులకు తాను చేస్తున్న కృషికి ప్రజలు, అధికారులు సహకరించి మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రహమాన్, మత గురువులు మహమ్మద్ మునావర్ హుస్సేన్, అబ్దుల్ అజీజ్ మంజార్, మత పెద్దలు జహంగీర్ షరీఫ్, రబ్ సాబ్,అబీద్ హుస్సేన్, జావీద్ సాటే, బాసిత్‌భాయ్, ఖాద్రి, యాకుబ్,సిపిఐ నాయకులు దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళి,తూము చౌదరి, నాగా సీతారాములు, పల్లపోతు సాయి,మాజీ కౌన్సిలర్స్,వివిధరాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు

# కలెక్టర్కు, ఎస్పీకి ఖురాన్ అందజేసిన జావేద్



కొత్తగూడెం మార్చి 28 నవభూమి ప్రతినిధి: అహిలే హదీస్‌కు చెందిన బాధ్యులు ప్రముఖ వ్యాపారి జావేద్ శుక్రవారం కొత్తగూడెం క్లబ్లో దావత్ ఇఫ్తార్ సందర్భంగా ఖురాన్ ఇంగ్లీష్ ప్రతులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుకు అందజేశారు

## గుండె పోటుతో మాజీ సీనియర్ విలేకరి మృతి



**గార్ల, నవభూమి, మార్చి 28:** గార్ల మాజీ సీనియర్ విలేకరి షేక్ యాకుబ్ మియా (62) గుండె పోటుతో శుక్రవారం వారం మృతి చెందారు. మధ్యాహ్నం ఇంట్లో సేద తీర్చుకుంటున్న ఆకస్మాత్తుగా ఛాతి నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటిన మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విలేకరిగా, కాగితాలు రాసే యాకుబ్‌గా ఈ ప్రాంతంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న యాకుబ్ మియా ఆకాల మరణం పొందడం పట్ల మండలంలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విలేకరుల సంఘాల సభ్యులు యాకుబ్ మియా పార్థివదేహానికి నివాళులర్పించి, అయన కుటుంబాన్ని పరామర్శించారు.

## భూములు కోల్పోయిన బాధితులకు చెక్కుల పంపిణీ



**భద్రాచలం మార్చి 28 నవభూమి ప్రతినిధి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయానికి ఆనుకొని ఉన్న ఆలయ అభివృద్ధి కోసం నష్టపోయిన బాధిత కుటుంబాలకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఇల్లు భూములు పోయిన కుటుంబాలకు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో దామోదర్ రావు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

## హెూరాహెూరీగా అశ్వాపురం వారపు సంత వేలం పాట

### రూ/ఐదు లక్షల 80 వేలకు కైవసం చేసుకున్న కుంజా ప్రసాద్

**అశ్వాపురం మార్చి 28 నవభూమి:** అశ్వాపురం మండల కేంద్రంలోని అంగడి (సంత) వేలం పాట శుక్రవారం అశ్వాపురం మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో అధికారులు నిర్వహించారు. 36 మంది డిపాజిటర్లు పాల్గొన్న సంత వేలం పాటను పంచాయతీ కార్యదర్శి మల్లేశం అధ్యక్షతన నిర్వహించగా సభ్యులు పోటాపోటీగా సంత వేలాన్ని రూ.5,80,000 ఐదు లక్షల యానభై వేల రూపాయలు కు గాను కుంజా ప్రసాద్ సంత వేలం పాట ను దక్కించుకున్నారు. వేలంపాట హక్కుదారులుగా ఏప్రిల్ ఒకటి నుండి 31-03- 2026 వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంట వరప్రసాద్, గ్రామపంచాయతీ అబ్జర్వర్ ప్రేమలత, కార్యదర్శి మల్లేశం పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు





# విద్యతోనే మనకు అస్తిత్వం సాధ్యం

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రతిరోజు విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి
- టీచర్లు, తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలి
- జవహర్ నవోదయ విద్యాలయం వార్షిక దినోత్సవ వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




**ఖమ్మం/కూసుమంచి,నవభూమి, మార్చి 28:** విద్యతోనే మనకు అస్తిత్వం లభిస్తుందని, మన జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కూసుమంచి మండలం పాలేరు లోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన వార్షిక దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ అందరికీ విద్య అందించేందుకు మన దేశంలో సుదీర్ఘ పోరాటాలు జరిగాయని, గతంలో రాజుల కొడుకులకు, ప్రముఖులకు మాత్రమే చదువుకునే అవకాశం ఉండేదని తెలిపారు. చదువు లేకపోతే మన అస్తిత్వం కోల్పోతామని, ప్రతి చిన్న అంశంలో ఇతరులపై ఆధారపడి జీవించాల్సి ఉంటుందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950 నుండి అందరికీ సమానంగా చదువు దక్కాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆలోచన చేపట్టిందని అన్నారు. మన జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు విద్య తప్పనిసరి అని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం మనం బాగా చదువుకుంటే భవిష్యత్తులో మన అమ్మా, నాన్నలను బాగా చూసుకోవచ్చని అన్నారు. గతంలో తల్లిదండ్రులకు వివిధ కారణాల వల్ల చదువుకునే అవకాశం లభించలేదని, ప్రస్తుతం మనకు నవోదయ పాఠశాల వంటి అద్భుతమైన చోట చదువుకునే అవకాశం వచ్చిందని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులు వారి అమ్మా నాన్నలకు, టీచర్లకు అత్యధికంగా గౌరవం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. మనకు విద్యాబుద్ధులు అందించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ టీచర్లు బోధిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగా లేకపోయినా పిల్లల కోసం పని చేస్తారని, మనం ఏం చేసినా వారి రుణం తీర్చు కోలేమని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులంతా పుస్తకాలు చదివే అలవాటు అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజు ఒక గంట సమయం పుస్తకాలు చదివేందుకు కేటాయించాలని, పరీక్షల కోసం కాకుండా విజ్ఞానం కోసం చదవాలని కలెక్టర్ తెలిపారు. ఫోన్లతో గడిపే సమయాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని , సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

మనం రెగ్యులర్ గా చదవడం అలవర్చు కుంటే క్రమశిక్షణ, మంచి ప్రవర్తన ఏర్పడుతుందని అన్నారు. కఠినమైన ప్రవేశ పరీక్షకు ఉత్తీర్ణత సాధించి నవోదయ విద్యాలయాల్లో సీటు సాధించారని అన్నారు. మనకు లభించిన అవకాశం ద్వారా మరో నలుగురికి ఎలా సహాయపడాలి అనే ఆలోచన చేయాలని, ఇతరులను ఎప్పుడు చిన్నచూపు చూడవద్దని కలెక్టర్ తెలిపారు. జీవితంలో మన లక్ష్యాలను సాధించిన తర్వాత సమాజంలో మరో నలుగురు అభివృద్ధి చెందేందుకు మనమంతా సహకారం అందించాలని, ఇతరులకు సహాయం చేయడంలో వచ్చే సంతృప్తి మనం ఎంత ఎత్తుకు ఎదిగిన దక్కదని కలెక్టర్ తెలిపారు. మనం జీవితం ఎలా గడిపాం అనే దానిపై చరిత్రలో మనకు స్థానం లభిస్తుందని అన్నారు. పాఠశాలలో స్నేహితులు ఒకరికి మరొకరు చదువులో సహాయం చేసుకోవాలని, ఒకరు బలహీనంగా ఉన్న పాఠ్యాంశాలను మరొకరు బోధించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులంతా భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగి దేశానికి గొప్ప పేరు తీసుకుని రావాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో విజేతలకు కలెక్టర్ జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వెంకట రమణ, పేరెంట్ టీచర్స్ కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు









# తాటి రామయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

**అశ్వాపురం మార్చి 28 నవభూమి:** అశ్వాపురం మండలం ఉమ్మడి గొందిగూడెం గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించబడుతున్న తాటి రామయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులు హాజరైన కందుల కృష్ణార్జున రావు, సూదిరెడ్డి గోపి రెడ్డి, పినపాక నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు వారితోపాటు గ్రామ పెద్దలైన మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ వైఫ్ ఆఫ్ సర్వేస్వరావు, సోయం నరసింహారావు, గోల్లపల్లి నాగేశ్వరావు వారితోపాటు గొందిగూడెం యూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు అందరూ హాజరై ప్రారంభించినారు. అలాగే ఈ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులైన ఇట్టి కార్యక్రమం ప్రారంభించడానికి ముఖ్యులైన తాటి నాని వెంకటలక్ష్మి, గొందిగూడెం పంచాయతీ బిఆర్ఎస్ నాయకులైన యూత్ లీడర్ ఉప్పునూతల మహేష్, ఎనంపల్లి లక్ష్మన్న, రామన్న , అబ్బోజు రామ్మోహన్, వేణు, కాటిపోయిన గంగయ్య, కురుస నరసరావు నాయిని నరసింహారావు వారితో



పాటు గూడెం మాజీ సర్పంచ్ కలేటి నరసింహారావు, గొండిగూడెం కొత్తూరు మాజీ సర్పంచ్ సూరిబాబు, క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు. వారికి పేరుపేరునా క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు

# ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందే: సీనియర్ జర్నలిస్ట్ యండి ఉస్మాన్ ఖాన్



**ములకలపల్లి మార్చి 28 నవభూమి:** ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లును మోడీ సర్కార్ వెంటనే ఉపసంహరించుకోవాలని సీనియర్ జర్నలిస్ట్ యండి ఉస్మాన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లింలు శుక్రవారం ప్రార్ధనల అనంతరం మండల పరిధిలోని జగన్నాథపురంలో చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మాన్ ఖాన్ మాట్లాడుతూ దేశ ముస్లిం సమాజం, ప్రతి పక్షాలు, పౌర సంఘాల అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రస్తుత సమావేశాల్లోనే బిల్లును ఆమోదింపజేసుకోవాలని మోడీ సర్కార్ కుట్ర పన్నిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బిల్లును అడ్డుకొని ఆమోదం పొందకుండా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో ఈనేతలు ముస్లిం సమాజానికి చేసిన వాగ్దానాలను ఆయన గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ముస్లిం సమాజంలో ఇంత ఆందోళన వ్యక్తమవుతున్నా ఇంతవరకు చంద్రబాబు తన వైఖరిని స్పష్టంగా ప్రకటించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఏమాత్రం తేడా జరిగినా సుదీర్ఘ దేశవ్యాప్త నిరసనలు, శ్రీఆందోళనలు, పోరాటాలకు ముస్లిం సమాజం సిద్ధమై ఉందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ జబ్బార్, జమీర్, షబ్బీర్, వాజిద్, యాఖూబ్, బాజీబాబా, మౌలానా, ఖన్నా, జమాల్, జానీ పాల్గొన్నారు.

# అశ్వాపురం జామా మసీద్ కమిటీ సభ్యుల నిరసన



**అశ్వాపురం మార్చి 28 నవభూమి:** ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు వర్ఫ్ బోర్డు భూములను ధ్వంసం చేస్తూ సివిల్ కోడ్ ను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రకటన ను వ్యతిరేకిస్తూ శుక్రవారం జమా మసీదులో అశ్వాపురం మండల కమిటీ పిలుపుమేరకు మండలంలో ఉన్నటువంటి ముస్లిం సోదరులు నమాజ్ అనంతరం నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జమా మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ గంజు షాహిద్, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షులు ఎస్కే ఖదీర్, జనరల్ సెక్రెటరీ ఎండి రఫీ ఖాన్, ఆర్గనైజర్ సెక్రెటరీ ఎండి అమర్, జమా మసీద్ కమిటీ సభ్యులు జామ మస్జీద్, కమిటి సభ్యులు ముస్లిం మైనార్టీ మండల కమిటీ సభ్యులు, అశ్వాపురం మండల ముస్లింలు పాల్గొన్నారు

# జైబాపు-జైభీమ్ జై సంవిధానంలో కాంగ్రెస్ నాయకులు

**కుత్బుల్లాపూర్ - మార్చి 28:(నవభూమి ప్రతినిధి)** ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచనల మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణ మహాత్మా గాంధీ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి ఎత్తున పాల్గొన్నారు

# ఉపేందర్ కామేషులకు కోటి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

- భద్రాచలంలో 6 అంతస్థుల భవనం కూలిపోయిన సంఘటనలో
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి




**సత్తుపల్లి, నవభూమి, మార్చి 28 :** భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం కూలిపోవడంతో శిధిలాల క్రింద పడి చనిపోయిన పడిశాల ఉపేందర్, కామేష్ కుటుంబాలకు కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నీలం రామచంద్రయ్య భవనంలో పార్టీ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలంలో అక్రమంగా ఆరు అంతస్థుల భవనం నిర్మాణం జరుగుతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రమాదానికి భవన యజమానితో పాటు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడా బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఈవోను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కుటుంబ సభ్యులకు నష్టపరిహారం కోటి రూపాయలు నష్టపరిహారంతో పాటు , కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.భక్తి ముసుగులో కోట్ల రూపాయలు దండుకుంటున్న శ్రీపతి శ్రీనివాస్ ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. శ్రీపతి శ్రీనివాసు శిధిలావస్థకు చేరిన బిల్డింగ్ ను నిర్మిస్తున్న క్రమంలో చుట్టుపక్కల ఇండ్ల వాళ్ళు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం వలనే ఈ దుర్ఘటన జరిగి ఇద్దరు బలయ్యారు అన్నారు. అక్రమంగా నిర్మాణం చేయటం అతనికి పరిపాటిగా మారిందన్నారు.ఇది ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్లిన వారి కుటుంబాలు ఈరోజు వీధిన పడ్డాయన్నారు. వారి ఆలనా పాలన చూసే నాథుడు లేడన్నారు. ఆ కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల ఎక్స్గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని లేని ఎడల ప్రజలు ఆందోళన తప్పదని గోకినేపల్లి హెచ్చరించారు . సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గంటా శ్రీను, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్, మండల కార్యదర్శి తాటిరాజు, ఒగ్గు నాగిరెడ్డి, కోర్స వెంకటేష్, దుంపరాగవులు, రెడ్డి వెంకటేష్, కుంటా కృష్ణ, అలివేలు, చిన్న బద్రం తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి దేవస్థానం కమిటీలో విశ్వహిందూ పరిషత్ సభ్యులకు స్థానం కల్పించాలి

**పాల్వంచ మార్చి 28 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండలం లోని కేశవాపురం - జగన్నాధపురం గ్రామం లోని దేవాలయాల శాఖ పరిధిలో ఉన్న ప్రసిద్ధ శ్రీ పెద్దమ్మతల్లి దేవస్థానం ధర్మకర్తల పాలక మండలి లో ధార్మిక సంస్థలు అయిన విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ సంస్థల నుండి కూడా సభ్యులను తీసుకోవాలని కోరుతూ శుక్రవారం దేవస్థానం ఈవో రజనీ కుమారి కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవస్థానం కమిటీ లో దేవుడిని నమ్మని వాస్తిక వాద పార్టీల వారి చోటు ఇవ్వడం కన్నా, ధార్మిక సంస్థల ప్రతినిధులను తీసుకుంటే దేవాలయ పవిత్రతను కాపాడే ప్రయత్నం చేస్తారని ఆన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం పరిసరాలలో జరుగుతున్న హలాల్ ను గతంలో నిషేదించినా మళ్ళీ దేవస్థానం పరిసరాలలో అమ్మవారికి సమర్పించే మొక్కులను హలాల్ చేస్తున్నారని, ఇది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విషయమనీ, అమ్మవారికి అపవిత్రం అయిన నైవేద్యం ఎలా పెడతారని, కనుక దేవస్థానం పరిసరాలలో జరుగుతున్న అన్యమత హలాల్ ను తక్షణమే నిషేధించాలని, నియమానిబంధనలను ఉల్లంఘించే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ



కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చిలుకూరి నాగేశ్వరరావు, జిల్లా ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ వింజమూరి మురళీకృష్ణమాచార్యులు, బజరంగ్దళ్ జిల్లా సాప్తాహిక్ మిలన్ ప్రముఖ్ శ్రీరామోజు మధుసూదన చారి, పాల్వంచ ప్రఖండ అధ్యక్షులు గుగులోత్ లింబా నాయక్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# విద్యుత్ సమస్య ఏర్పడకుండా ఐటీడీఏలో ట్రాన్‌ఫారం ఏర్పాటు

- పాల్గొన్న ఐటీడీఏ పీవో బి రాహుల్

**భద్రాచలం మార్చి 28 నవభూమి ప్రతినిధి:** ఐటీడీఏ ప్రాంగణంలోని ప్రముఖులు బస చేసే హౌసింగ్ గెస్ట్ హౌస్ మరియు గిరిజన భవనములో ప్రత్యేక సందర్భాలలో జరిగే సమావేశాలలో విద్యుత్ సమస్య ఏర్పడకుండా ఆ రెండు భవనాలకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, ఫీడర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం నాడు ఐటిడిఏ ప్రాంగణంలోని హౌసింగ్ గెస్ట్ హౌస్ మరియు గిరిజన భవనమునకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా కొరకు నిర్మాణం చేపట్టిన ట్రాన్స్ఫార్మర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖులు బస చేసే హౌసింగ్ గెస్ట్ హౌస్ లో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉండేదని అలాగే ప్రత్యేక సందర్భాలలో గిరిజన భవనంలో జరిగే సభలు సమావేశాలలో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుండడంతో ఆ రెండు భవనాలకు నాలుగు లక్షల వ్యయంతో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ మరియు కెపాసిటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం శ్రీరామనవమికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు పర్యటిస్తున్నందున, హౌసింగ్ గెస్ట్ హౌస్ లో ఏమైనా మైనర్ రిపేర్ లు ఉంటే చేయించాలని అలాగే వచ్చే విఐపి లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా హౌసింగ్ గెస్ట్ హౌస్ లో అన్ని రకాల సౌకర్యాలు



కల్పించి, గెస్ట్ హౌస్ ను సర్వ సుందరంగా ముస్తాబు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏపీవో పవర్ రేణు, ఏటీడీవో అశోక్ కుమార్, టి ఎ శ్రీనివాస్, ఏ ఈ రవి, విద్యుత్ శాఖ డి ఈ జీవన్ కుమార్, ఏ ఈ దుర్గాప్రసాద్, సబ్ ఇంజనీర్ రాజారాం, చలపతి మరియు విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## భీమవరంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



**ఎర్రుపాలెం, నవభూమి, మార్చి 28 :** మండల పరిధిలోని భీమవరం గ్రామంలోని మసీదులో మధిర నియోజకవర్గ ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందించారు. రంజాన్ పండుగ సందర్భంగా సేమియా, పాలు, పంచదార, బట్టలు(రంజాన్ తోఫా) పంపిణి కార్యక్రమం గ్రామ ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ గాలి సాహెబ్ ఆధ్వర్యం లో అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ముస్లిం కమిటీ అధ్యక్షలు గాలిబ్ సాహెబ్, మాజీ సర్పంచ్ షేక్ బహదూర్ ఖాన్,కమి టీ సభ్యులు ఖాసీం సాహెబ్,జానిమియా ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## వక్స్ బోర్డ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసన



**ఎర్రుపాలెం, నవభూమి,మార్చి 28:** మండల కేంద్రం ఎర్రుపాలెం మసీదు నందు ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో వక్స్ బోర్డ్ 2024 చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం సోదరులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన దగ్గర నుండి ఉంటున్న చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింలు ఐక్యంగా నిరసన లను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముస్లింఐక్య సంఘం ఎరుపాలెం మండల ఉపాధ్యక్షులు షేక్ ఇమాం సాహెబ్,ఎర్రు పాలెం మస్జీద్ కమిటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్,కమిటీ సభ్యులు షేక్ సలాం, టెంట్ మహబూ,మాజీ ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలి,(కత్తులు)పఠాన్ బాజీ, రిజ్వాన్,షేక్ బాజీ తదితర ముస్లిం పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలియ జేశారు

## భీమానగదు అందించిన సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి

**ఎర్రుపాలెం, నవభూమి, మార్చి 28:** ఎర్రుపాలె డిసిసిబి బ్రాంచ్ పరిధిలోని పెద్ద గోపవరం పిఎసిఎస్ సంఘం నందు రుణాలుపొంది ఇటీవల అనారోగ్యంతో ఇద్దరు సభ్యులు మృతి చెందారు.మృతి చెందిన సభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన భీమా నగదును వారి కుటుంబ సభ్యులకుశుక్రవారం ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంకులోజరిగిన కార్యక్రమంలో అందించారు.బనిగండ్లపాడు గ్రామానికి చెందిన సంఘ సభ్యులు మర్రి భూమయ్య మరణించగా భార్య యశోదకు,శీలం వెంకటేశ్వర్ రెడ్డి మృతి చెందగా ఆయన భార్య పద్మావతికి ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చొప్పున మొత్తం1 లక్ష రూపాయలు వారి కుటుంబ సభ్యులకు సంఘ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు మేనేజర్ దివ్య,డైరెక్టర్ వేమిరెడ్డి వెంకటరెడ్డి,సూపర్వైజర్ సుధాకర్,సిఈఓ వీరారెడ్డి,బ్యాంకు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు



## పెద్దమ్మ గుడి పాలక మండలి నియామకాన్ని పునః సమీక్షించాలి

■ పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు



**పాల్వంచ మార్చి 28 నవభూమి ప్రతినిధి:** మండల పరిధి లోని శ్రీ కనకదుర్గ దేవస్థానం పెద్దమ్మ గుడి దేవాలయం పాలక మండలి కమిటీ నియామకాన్ని పునః సమీక్షంచాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, మండల అధ్యక్షుడు కొండం వెంకన్నలు అన్నారు. శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కమిటీ లో జగన్నాథపురం, కేశవాపురం గ్రామస్థులకు అవకాశం కల్పించాలని అన్నారు. అదే విదంగా కమిటీలో సమతుల్యత పాటించాలన్నారు. కమిటీ ఏర్పాటులో సమతుల్యత పాటించలేదని, అసెంబ్లీ ఎన్నికల నుండి పార్టీ అభివృద్ధి కోసం కష్ట పడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు సరైన ప్రాతి నిధ్యం కమిటీ లో లభించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కి, అనుబంధ కార్మిక సంఘానికి, సంబంధం లేని ఉద్యోగులకు డైరెక్టర్ల స్థానాల్లో చోటు కల్పించడం బాధాకరమన్నారు. పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల ప్రతిపాదనలు పరిగణ లోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న కాంగ్రెస్ నాయకుల పేర్లను ఉద్దేశ పూర్వకంగా దేవాదాయశాఖ అదికారులు ఫైనల్ లిస్ట్ నుండి తొలగించడం పై విచారణ జరపాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకు రావడానికి గత 10 సంవత్సరాలుగా కష్టపడ్డ కార్యకర్తలకు చోటు కల్పించాలని, ఇప్పటికే ప్రకటించిన పాలకమండలిని పునఃసమీక్షించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ శ్రీధర్ లకు మెయిల్ ద్వార విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు త్వరలోనే జిల్లా మంత్రులను కలిసి, స్థానిక కార్యకర్తల మనోభావాలను వారికీ తెలియపరుస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బానోత్ రాము నాయక్, బట్టు మురళి, జిల్లా టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షులు సాదం రామకృష్ణ, పట్టణ కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, కొమర్రాజు విజయ్, కాపర్తి వెంకటా చారి, పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షులు పెంకి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు హెచ్చు మధు, పవన్, పాల్వంచ రూరల్ కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షులు కట్టా సోమయ్య, హుస్సేన్ నాయక్, సతీష్, వేమా రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

**భద్రాచలం మార్చి 28 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణంలో నిర్మాణం లో ఉన్న భవనం కూలిపోయి ప్రమాదంలో చనిపోయిన రెండు కుటుంబాలను గురువారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు. రేగా కాంతారావు పరామర్శి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.బాధిత కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ఆందోళనలో సైతం భాగస్వామ్యులై కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణం కట్టొద్దని గతంలో పంచాయతీ అధికారులు నోటీసు ఇచ్చిన నోటీసులు తీసుకొని నిర్మాణం జరగడానికి కారణమైన అదృశ్య శక్తి ఎవరు కనుక్కొని అట్టి వ్యక్తులపై కూడా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి నష్టపరిహారంఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం భద్రాచలం ఆర్డీవోతో సమావేశంమై సమస్యపై చర్చించారు. ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా భాధిత కుటుంబాలకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు



రావులపల్లి రాంప్రసాద్ బోదే బోయిన బుచ్చయ్య మణుగూరు మాజీ జడ్పిటిసి పోచం నరసింహ రావు, మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, కోటగిరి ప్రమోద్ కుమార్, కొల్లం జయ ప్రేమ కుమార్, రామకృష్ణ, డానియల్, ప్రదీప్, గుంజ ఏడుకొండలు, బద్ది బాబి, పృద్వి, ఇమంది నాగేశ్వరరావు, ప్రకాష్, మోహన్ రావు,ప్రియాంక ఉన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దంను సన్మానించిన రెడ్డి సంక్షేమ సమాఖ్య



**మణుగూరు మార్చి 28 నవభూమి ప్రతినిధి:** మణుగూరు లోని రెడ్డి సంక్షేమ సమాఖ్య ఆఫీస్ నందు అధ్యక్షులు నాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన బద్దం శ్రీనివాస రెడ్డిని తొలుత పూలబొకే తో ఆహ్వానించి శాలువా షీల్డ్, పూల దండతో మణుగూరు రెడ్డి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భముగా బద్దం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మన సంఘం తరుపున లీగల్ అడ్వాయిజర్ గా ఉంటానని, రెడ్డీస్ తరుపున న్యాయ స్థానంలో పేద రెడ్డిస్ తరుపున నిలబడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యాక్రమంలో రెడ్డి సంక్షేమ సమాఖ్య చక్రటరీ ఆలేటి అశోక్ రెడ్డి, ట్రెజరర్ గాయం అవినాష్ రెడ్డి, సామ శ్రీనివాస




రెడ్డి, గణేష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి (రైస్ మిల్), యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, సురేందర్ రెడ్డి,రాంరెడ్డి, గ్యాస్ కొండా రెడ్డి, రాఘవ రెడ్డి, ఉడుముల తిరుపతి రెడ్డి, దేవిరెడ్డి ఆదిరెడ్డి,కోట రాము, ఆదినారాయణ రెడ్డి, రెడ్డెమ్ శంకర్ రెడ్డి,సురేందర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,మౌనిక బేకరీ రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ఉపకార వేతనాల గడువు పెంపు

### మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా



**పాల్వంచ మార్చి 28 నవభూమి ప్రతినిధి:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని మే 31వ తేదీ వరకు పొడిగించటం జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11, 88,120 ధరఖాస్తుల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 10, 34, 074 ధరఖాస్తులు చేసుకున్నారని, ఇంకా సుమారు 1,54,046 మంది ధరఖాస్తు చేసుకోవాల్సి ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గడువు తేదీని మే 31వరకు పొడిగించటం జరిగిందన్నారు. ఇట్టి అవకాశాన్ని ఎస్.సి, ఎస్.టి, ఈబిసి, మైనారిటీ ,దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## విద్యార్థులకు నైపుణ్య శిక్షణ: విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్





**అన్నపురెడ్డిపల్లి మార్చి 28 నవభూమి:** ఎర్రగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు స్థానిక ఎర్రగుంట గ్రామంలోని శ్రీ రామకృష్ణ రైస్ మిల్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ఆధ్వర్యంలో 6,7,8,9 తరగతుల విద్యార్థులు రైస్ మిల్లులో జరిగే వివిధ రకాల పనులను మిల్లు యజమాని రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. వడ్ల నుండి ఏ విధంగా బియ్యం, తవుడు, ఊక, నూకలు ఏ విధంగా వస్తాయో తెలుసుకున్నారు. ఈ స్థానిక చిన్న పరిశ్రమ సందర్శనలో ఉపాధ్యాయులు సునంద రెడ్డి, శాంత కుమారి, సరిత, ప్రమీల రాణి, జయరామ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠంలో చదువుకున్న అంశాలను స్థానికంగా పరిశీలించినప్పుడు మరింత అవగాహన కలుగుతుందని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు

## శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలు, లెక్కింపు

**కుషాయిగూడ, మార్చి28,(నవభూమి న్యూస్):** కుషాయిగూడ శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి సి హెచ్.ప్రణీత్ కుమార్ సమక్షంలో శుక్రవారం హుండీలను విప్పి లెక్కించగా రూ. 7,19,955/- లు ఆదాయంగా రావడం జరిగినది. ఈ హుండీ ల లెక్కింపు నందు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సంకూరి శ్రీనివాస్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి యం. వీరేశం, తాళ్ళ వెంకటేష్ గౌడ్, ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రఘుపతి గౌడ్, ఆర్.కే. లక్ష్మీ నారాయణ, అమరా చారి, ఉమా సేవకురాలు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఘటనపై ప్రజాప్రతినిధులు

# స్పందించకపోవడం దుర్మార్గం

- చట్టాలను ఉల్లంఘిస్తున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి
- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి
- శ్రీపతి వెనకాల ఉన్న శక్తులు ఎవరో బయటపెట్టాలి
- భవనం కూలిన ఘటనపై సమగ్రవిచారణ జరపాలి
- సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు




**భద్రాచలం మార్చి 28 నవభూమి ప్రతినిధి:** భద్రాచలంలో భవనం కూలి ఇద్దరు కూలీలు మృత్యువాత పడిన ఘటనపై రాష్ట్ర మంత్రులు గాని, ఎంపీ ఎమ్మెల్యేలు గానీ స్పందించకపోవడం ఆ కుటుంబాలకు ప్రభుత్వం తరఫున భరోసా కల్పించకపోవడం దుర్మార్గమైన చర్య అని, కూలీల ప్రాణాలు అంటే పాలకులకు లెక్క లేదా అని సిపిఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక చందర్రావు భవనంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఐదవ షెడ్యూల్ ను విస్మరిస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్న అవినీతి అధికారులపై వెంటనే చర్యలు చేపట్టాలని ఇద్దరు కూలీల మృత్యువుకు కారణమైన గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పై వెంటనే సస్పెన్షన్ వేటు వేయాలని మచ్చ డిమాండ్ చేశారు.

**చట్టాలను కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉంది**

అభివృద్ధి పేరుతో గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని మచ్చ ప్రశ్నించారు. గిరిజన చట్టాలు కొందరు దళారులు అధికారులకు కల్పతేరువుగా మారాయని గత రెండు సంవత్సరాలుగా పట్టణంలో పుట్టగొడుగుల నిర్మిస్తున్న బహుళ అంతస్తులే వాటికి ప్రత్యక్ష నిదర్శనం అని మచ్చ స్పష్టం చేశారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు కల్పించుకొని భద్రాచలం చట్టాలను కాపాడాలని మచ్చ కోరారు

**శ్రీపతి వెనకాల ఉన్న శక్తులు ఎవరో బహిర్గతం చేయాలి**

షెడ్యూల్ ప్రాంతంలో ఆరు అంతస్తులకు అనుమతి లేనప్పటికీ నాసిరకంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని పిఓ ఆదేశించిన లెక్కచేయని శ్రీపతి వెనకాల ఉన్న శక్తుల పేర్లు బహిర్గతం చేయాలని అదే విధంగా శ్రీపతికి ఎన్ని కోట్ల రూపాయలు ఏ విధంగా వచ్చాయో విచారణ చేపట్టాలని మచ్చ కోరారు. శ్రీపతి భవన నిర్మాణం వెనుక క్యాబినెట్ స్థాయి మంత్రుల కుటుంబ సభ్యుల పాత్ర పై దిగుతేల్చాలని మచ్చ డిమాండ్ చేశారు

**మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి**

భవనం కూలిన ఘట్టలో మృతి చెందిన కామేశ్వరరావు ఉపేందర్ కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున వెంటనే నష్టపరిహారం అందించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని సిపిఎం పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నామని మచ్చ స్పష్టం చేశారు. అదేవిధంగా భవనం కూలిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి ఆ భవన నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ పెద్దలపై బహిరంగంగా చర్యలకు ఆదేశించాలని భవిష్యత్తులో భద్రాచలంలో ఇటువంటి సంఘటన కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మచ్చ కోరారు.

**శిథిలాల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యేంతవరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించాలి**

ఉపేంద్ర మృతదేహం దొరికిన వెంటనే శిథిలాల తొలగింపు చర్యలు ఆపివేయటం సరైనది కాదని శిథిలాల తొలగింపు ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు రెస్క్యూఆపరేషన్ కొనసాగించాలని శిథిలాల కింద మరెవరైనా ఉండొచ్చేమోనన్న స్థానికుల అనుమానాలను నివృత్తం చేయాల్సిన బాధ్యత స్థానిక అధికారులపై ఉందని మచ్చ గుర్తు చేశారు.

**బాధితులకు అండగా సిపిఎం పోరాటాన్ని కొనసాగిస్తుంది**

బాధిత కుటుంబాలకు సిపిఐఎం ఎప్పుడు అండగా ఉంటుందని మృతుల కుటుంబాలకి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేంత వరకు సిపిఐఎం పోరాటం కొనసాగిస్తుందని మచ్చ స్పష్టం చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి పాల్గొన్నారు

## ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులకై తహసిల్దార్‌కు వినతి

**అశ్వారావుపేట టౌన్ మార్చి 28 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మండల పిఆర్టియు సంఘ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కృష్ణ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు జిడిఎఫ్ లోన్లు, టీఎస్ జిఎల్ఐ లోన్లు సరెండర్ లీవ్స్ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా పొదిలి సత్యనారాయణ జడ్పీహెచ్ఎస్ పాల్వంచ వారి భార్య అనారోగ్యం నిమిత్తం వైద్య ఖర్చుల కొరకు జిడిఎఫ్ లోను కొరకు సంవత్సరం క్రితం అప్లై చేయగా నేటికీ రాలేదు. వారి భార్య తీవ్ర అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందినారు. ఉపాధ్యాయులు వివిధ అవసరాల కోసం లోన్లకు అప్లై చేసి అది మంజూరు కాక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. కావున మా సమస్యలను మీ దృష్టికి తీసుకు వస్తున్న మా తరఫున మీరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని తెలియజేస్తూ తాసిల్దారుకు వెనుక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ సభ్యులు పాల్గొన్నారు



## ముస్లిం సోదరులకు పూర్ణచంద్రారెడ్డి ఇఫ్తార్ విందు

**ఎర్రుపాలెం, నవభూమి, మార్చి 28 :** మండల పరిధిలోనిభీమవరం గ్రామంలోని ముస్లింసోదరులకు యరమలపూర్ణచంద్రా రెడ్డి శుక్రవారంవిప్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింసోదరీసోదరులకు పవిత్ర మాసం రంజాన్ పండుగ సందర్భంగా భీమవరం గ్రామంలోని ప్రతి ముస్లిం కుటుంబానికి భార్యాభర్తలకు నూతన వస్త్రాలనుబహుకరించారు. ప్రతి కుటుంబా నికి సేమ్యా,పంచదార అందించారు. భీమ వరంగ్రామ ముస్లింలు అందరూ విప్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# గార్లలో ఫాస్టర్ల నిరసన ప్రదర్శన




**గార్ల, నవభూమి, మార్చి 28:** ఫాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ గార్ల మండల ఫాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గార్లలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మసీదు సెంటర్ నుంచి బయలు దేరిన ప్రదర్శన పురవీధులలో గుండా నెహ్రూ సెంటర్ వరకు కొనసాగింది. పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరపాలని ప్రదర్శన లో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్స వెల్ఫేర్ సొసైటీ సభ్యులు టీమోటి, రత్న రాజ్, జోసెఫ్, జాన్ పాల్, జార్జ్ ముల్లర్, పాల్, జాన్, హనోకు, రత్న రాజ్, శ్యాముల్, కల్పన, బాజీ, యుసేపు, రాజు, తదితరులు పాల్గొన్నారు

# అందరి సహకారంతో ఆరోగ్య సభలు విజయవంతం



**కొత్తగూడెం మార్చి 28 నవభూమి ప్రతినిధి:** ప్రకృతి ఆశ్రమ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించిన ఆరోగ్య మహాసభలు అందరి సహకారంతో విజయవంతం అయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. గురువారం రాత్రి బస్టాండ్ సమీపంలో ఆశ్రమ సర్వసభ్య సమావేశం జరిగింది. సభలను విజయవంతం చేసినందుకు ప్రకృతి ప్రేమికులకు, పర్యావరణ పరిరక్షకులకు, ఆరోగ్యాభిలాషులకు అభినందనలు తెలియజేశారు. ప్రత్యేకించి మీడియా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రకృతి ఆరోగ్యం పైన పర్యావరణ పరిరక్షణ పైన కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందించిన స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతానికి ఆర్థికంగా, హార్దికంగా సహాయ సహకారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగాఅందించిన వారందరికీ పేరు పేరునా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం ముఖ్య సలహాదారు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య ను ఘనంగా సత్కరించి సన్మానించారు. సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొక్కల వెంకటయ్య, డాక్టర్ బి కృష్ణయ్య, సింగరేణి ఏజీఎం గోనే శ్రీకాంత్, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్,కో-ఆర్డినేటర్ సుగుణా రావు,బంగారు శంకర్, దయానందసాగర్,రాజేంద్రప్రసాద్, తుంపూడి శివ రగణబాబులు పాల్గొన్నారు

# చేపల వేటకు వెళ్లి పిల్లి కృష్ణ కాంత్ మృతి

**రాయపర్తి మార్చి 28 (నవభూమి)** రాయపర్తి మండల కేంద్రంలోని పిల్లి సత్యనారాయణ స్వరూప కుమారుడు పిల్లి కృష్ణ కాంత్ (29 ) రాయపర్తి మండల కేంద్రంలో 25/ 3 /2025 మంగళవారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ఇంటి నుండి చేపల వేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులందరూ ఆందోళనతో ఆ రోజు నుండి వెతుకుతుండగా ఈరోజు 28/ 3 /2025 ఉదయం 7:30 నిమిషాలకు రాయపర్తి శివారులో నీ రిజర్వాయర్ నుండి వచ్చు నీళ్లలో పిల్లి కృష్ణకాంత్ మృతదేహం తేలియాడుతూ ఉండగా, వలలో చిక్కి ఉండగా రాయపర్తి గ్రామస్తులు పూజారి సాగర్ సన్నాఫ్ రాములు మరియు కావటం ఎలా స్వామి సన్నాఫ్ రామచంద్ర శవాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియపరచగా కుటుంబ సభ్యులు గుర్తించి మా కుమారుడు చాపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించడం జరిగిందని. ఎవరి మీద కూడా అనుమానం లేదని వ్యక్తపరచడం జరిగిందని కేసును నమోదు చేయడం. జరిగింది

# ఎక్సలెంట్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్




**అశ్వాపురం మార్చి 28 నవభూమి:** అశ్వాపురంలోని ఎక్స్ లెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్ ఫెస్టివల్ స్టాల్ ను ప్రారంభించి పాఠశాల విద్యార్థులు తయారు చేసుకుని వచ్చిన వివిధ ఆహార వంటకాలు రుచులను పరిశీలించి నగదు చెల్లించి పదార్థాలను కొనుగోలు చేశారు. అనంతరం పాఠశాలలోని మొత్తం విద్యార్థులు వారికి నచ్చిన ఆహార పదార్థాలను కొనుగోలు చేసి రుచులను ఆరగించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ



మన పాఠశాలలో ఈరోజు ఫుడ్ ఫెస్టివల్ వేడుక చేయటం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ప్రిన్సిపాల్ లెనిన్ మాట్లాడుతూ పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్ నిర్వహించుకోవడం,విద్యార్థులు స్వతహాగా రక రకాల వంటకాలు చేసుకొని రావడం, వారి యొక్క అభిరుచులు తెలుసుకోవడం, భారతీయ సంప్రదాయక వంటకాలను పరిచేయడం లాంటివి చేయడం సంతోకరం అని అన్నారు. అనంతరం ఈ ఫెస్ట్ లో పాల్గొన్న విద్యార్థులకు సహకరించిన తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయురాల్లకు కృతజ్ఞతలు తెలియజేశారు

# పెద్దమ్మ తల్లికి ఘనంగా పంచా అమృతాభిషేకం



**పాల్వంచ టౌన్ మార్చి 28 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం - జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము ( పెద్దమ్మ గుడి) లో శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి పంచా అమృతములతో వైభవముగా అభిషేకము నిర్వహించారు. ముందుగా మేళ తాళాలతో దేవస్థాన అర్చకులు భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయములోని అమ్మవారి మూల విరాట్ కు పంచా అమృతాలతో అభిషేకం,పంచ హారతులు,నివేదన, నీరాజన, మంత్రపుష్పం, తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. మాస శివరాత్రి సందర్భంగా పెద్దమ్మ గుడిలో రుద్ర హెూమం మాస శివరాత్రిని పురస్కరించుకొని పాల్వంచ మండలం కేశవాపురం- జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ




దేవస్థానం( పెద్దమ్మ గుడి)లో శుక్రవారం రుద్ర హెూమం స్వామి వారి కళ్యాణం ఆలయ ఆవరణంలో యాగశాలలో అత్యంత వైభవంగా, నిర్వహించ నున్నారు. దేవాలయంలో టెండర్-కం- బహిరంగ వేలం వాయిదా వస్తువుల అమ్మకమునకు సీల్డ్ టెండర్-కం- బహిరంగ వేలం నిర్వహించుటకు పాటదారులు ఎవరు రానందున వాయిదా వేయనైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజినీ కుమారి అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లెందులో పాస్టర్ల శాంతి ర్యాలీ



**ఇల్లెందు టౌన్ మార్చి 28 నవభూమి ప్రతినిధి:** పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మృతికి సంతాపంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు స్ట్రట్ ఫిట్ బస్తిలోనీ జెండా సెంటర్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం సి ఎస్పీ బస్తీ జెండా వద్ద నుండి హనుమాన్ జంక్షన్, సబ్ జైలు స్టేషన్ బస్తీ మీదుగా కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. స్టేషన్ బస్తీ మసీదు సెంటర్లో మృతికి సంతాపంగా స్థానిక పాస్టర్ గోరెముచు ప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి చాలా దారుణమని, మృతిపై చాలా అనుమానాలను



వ్యక్తపరిచారు. అధికారులు స్వార్థం లేకుండా న్యాయ విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోరెముచు మార్కు, చెవుల గురవయ్య, బాలస్వామి, స్థానిక మహిళలు, పెద్దలు, యువకులు కందుల గౌతమ్, ముత్యాల ప్రబోధ్, ఉలోజు దుర్గా ప్రసన, బాణాల శ్రీకాంత్ మంద రవి, క్రైస్తవ సోదర, సోదరీమణులు, పిల్లలు పాల్గొన్నారు

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డిని సన్మానించిన రెడ్డి సంక్షేమ సమాఖ్య





**మణుగూరు మార్చి 28 నవభూమి ప్రతినిధి:** మణుగూరు లోని రెడ్డి సంక్షేమ సమాఖ్య ఆఫీస్ నందు అధ్యక్షులు నాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన సూరం తరుణ్ రెడ్డి ని పూలబొకే తో ఆహ్వానించి శాలువా షీల్డ్, పూల దండతో మణుగూరు రెడ్డి సంఘం సన్మానించారు. ఈ కార్యాక్రమంలో రెడ్డి సంక్షేమ సమాఖ్య చక్రటరీ ఆలేటి అశోక్ రెడ్డి, ట్రెజరర్ గాయం అవినాష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి, గణేష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి (రైస్ మిల్),బద్దం శ్రీనివాస రెడ్డి, సురేందర్ రెడ్డి, రాంరెడ్డి, గ్యాస్ కొండా రెడ్డి, రాఘవ రెడ్డి, ఉడుముల తిరుపతి రెడ్డి, దేవిరెడ్డి ఆదిరెడ్డి, కోట రాము, ఆదినారాయణ రెడ్డి, రెడ్డెమ్ శంకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మౌనిక బేకరీ రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చంద్ర నరేంద్ర



**జూలురుపాడు, మార్చి 28 (నవభూమి ప్రతినిధి)–** భారత కమ్యునిస్టు పార్టీ (సి పి ఐ) అనుబంధ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చంద్ర నరేంద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈనెల 25 నుంచి 27 తేదీలలో నిజామాబాద్ పట్టణంలో జరిగిన రాష్ట్ర రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలో ఈ మేరకు ఎన్నుకున్నారు.నూతన రాష్ట్ర కమిటీని 21 మంది నూతన ఆఫీస్ బేరర్లుగా ఎన్నికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు రైతాంగం హీనమైన దారుణ పరిస్థితుల లోకి నెట్టి వేయబడుతున్నారని, పాలకప్రభుత్వాల దివాళా కోరు రాజకీయ విధానాలతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐనా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని అన్నారు.అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగానికి దేశవ్యాప్తంగా ఉన్న ఏడు లక్షల కోట్లరుణం మాఫీ చేయడానికి కుంటి సాకులు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మోడీ అధికారంలోకి వచ్చాక 16.5 లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు ఋణాలు రైట్ ఆఫ్ చేసి అప్పు ఎగవేత దార్లకు దోహదపడుతున్నారని విమర్శించారు. నల్ల చట్టాల రద్దు కోసం ఢిల్లీ సరిహద్దు లో నెలల తరబడి పోరాటం చేసి 758 మంది రైతులు ప్రాణత్యాగం చేశారని ఐనా రైతులకు ఇచ్చిన మాట నెరవేర్చ లేదని అన్నారు.జాతీయ మార్కెట్ విధానం పేరుతో దొడ్డిదారిన కార్పొరేట్ లను ప్రవేశపెట్టాలని చూస్తున్నారని అన్నారు. సి పి ఐ పార్టీ ఆధ్వర్యంలో రైతు హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు కల్పించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

**నాగారం, మార్చి28,(నవభూమి న్యూస్):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తా లో శుక్రవారం సంధాని మజీద్ లో ఇఫ్తార్ విందు పార్టీకి హాజరైన మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ సాయినాథ్ గౌడ్, అబీబు భాయ్, ఖాజా పాషా, ఎండి జలీల్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు

# డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్‌కి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన కిషన్ లాల్ రాజ్ పుత్





**ఇల్లెందు మార్చి 28 నవభూమి ప్రతినిధి:** విద్యావంతుడు, స్నేహశీలి, మృదుస్వభావి, నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ కు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించి, బంజారా జాతి మనస్సుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిరస్థాయిగా చెరగని ముద్రగా నిలిచిపోవాలని కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా నాయకులు మాలోత్ కిషన్ లాల్ రాజ్ పుత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. 10 సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడి గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసిన నాయకుడు డాక్టర్ రామచంద్ర నాయక్ అని అన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజల కష్టాలను దగ్గరుండి చూసిన నాయకుడని, వారికి మంత్రి పదవ ఇస్తే ప్రజల కష్టాలని తీరుతాయని అన్నారు. నిత్యం యువతను ప్రోత్సహిస్తూ, చదువుకున్న యువకులు రాజకీయాలకు రావాలని, ఈ రాజకీయ వ్యవస్థను మార్చాలనే ఉద్దేశంతో యువతకు ప్రాధాన్య ఇచ్చిన నాయకుడు డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ అని అన్నారు. 32 లక్షల మంది ఉన్న లంబాడ జాతికి న్యాయం జరగాలంటే నిత్యం జాతి ప్రయోజనాల కోసం కృషి చేసే నాయకుడు డాక్టర్ రామ చంద్రనాయక్ కి మంత్రి పదవి ఇవ్వాలని,తన వైద్య వృత్తిలో స్వయంగా పేదల కష్టాలను చూసి చలించి వారి కష్టాలను తీర్చడానికి రాజకీయంగా అడుగుపెట్టి ప్రతిక్షణం వారికి అండగా నిలిచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అత్యధిక మెజారిటీతో గెలిచిన ప్రజా నాయకుడు డాక్టర్ రామచంద్రనాయక్ అని, అత్యధిక గిరిజనులకు ఉన్న నియోజకవర్గ నుండి గెలిచిన ఎమ్మెల్యే కి మంత్రి పదవి ఇస్తే నేరుగా గిరిజనులకు ఇచ్చినట్టు అవుతుందని రాజ్ పుత్ పేర్కొన్నారు. విద్య, వైద్యం ఆర్థిక అన్ని రంగాల మీద విశేష అవగాహన కలిగిన నాయకుడు డాక్టర్ రామచంద్రనాయక్, రాజకీయ దురంధరుడు అయిన ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన రెడ్యా నాయక్ పై 53000 ఓట్ల పై చిలుకు మెజార్టీ గెలిచిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ కి మంత్రి పదవి ఇస్తే గత ఎన్నో సంవత్సరాలుగా పాలకుల ఆదరణకు నోచుకోక వెనుకబడిపోయిన డోర్నకల్, గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన డోర్నకల్ నియోజకవర్గానికి మంత్రి పదవిఇచ్చి అభివృద్ధి చేయవలసిందిగా మల్లికార్జున కర్గే, సోనియా గాంధీ,రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను మాలోత్ కిషన్ లాల్ రాజ్ పుత్ విజ్ఞప్తి చేశారు. డాక్టర్ రామచంద్ర నాయక్‌కు మంత్రిపదవిఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు

# దొరికిన రేషన్ దొంగలు

- 35 క్వింటాళ్ల బియ్యం, నగదు స్వాధీనం
- కల్లూరు ఏసీపీ రఘు







**కల్లూరు, నవభూమి, మార్చి28:** కల్లూరు మండలం చిన్న కోరుకోండి గ్రామంలో, రేషన్ షాపులో 180 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఈనెల 16వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేసి వైరా మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఓర్సు హనుమంతు, ఓర్సు కృష్ణ, వారితో పాటు సహకరించిన నల్లబోతుల ఉదయ్, వెలిశాల చందు, వ్యాన్ డ్రైవర్ గరిడేపల్లి జగదీష్ లను సిసి ఫుటేజ్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు కల్లూరు ఏసీపీ రఘు తెలిపారు. శుక్రవారం కల్లూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టుబడిన ఈ నిందితులు గతంలో రేషన్ బియ్యం అమ్ముకొని జీవించే వారని, కానీ ఇందులో వచ్చే డబ్బు సరిపోకపోవడంతో అత్యాశతో బియ్యం దొంగిలించేందుకు పథకం రూపొందించుకొని దొరికిపోయినట్లు తెలిపారు. ఎత్తుకెళ్లిన రేషన్ బియ్యంలో కొంతమేర అమ్మి వేయగా వచ్చిన నగదు రూ. 30 వేలు, వారి వద్ద ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి నేరాలు చేసే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసును చాకచక్యంగా చేదించిన పెనుబల్లి సీఐ ముత్తి లింగయ్య, కల్లూరు ఎస్సై డి హరిత, సిబ్బందిని అభినందించారు. అనంతరం నిందితులను పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బంది టి వెంకటేశ్వర్లు, శ్రీ ఎస్ శ్రీనివాసరావు, కి జగదీష్, ఎం రంగారావు, ఎస్.కె ఇర్షద్ లకు రివార్డ్ అందజేశారు. నిందితులను సత్తుపల్లి కోర్టులో హాజరుపరచునున్నట్లు ఏసిపి తెలిపారు

# వేమన శతక పద్యాలతో మనోవికాసం సాధ్యం

### అఫ్రియా ప్రతిభ అమోఘం

### వేమన శతక ద్వాదశ పృచ్ఛక అవధాన

### ముఖ్య అతిధిగా డీఈవో సోమశేఖర శర్మ

**సత్తుపల్లి, నవభూమి, మార్చి 28 :** విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి గురువులు,తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే అఫ్రియా వంటి మేధావులను సమాజానికి అందించ వచ్చని ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ అన్నారు.విశ్వావసు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వశాంతి పాఠశాల విద్యార్థిని మహమ్మద్ అఫ్రియా బాల అవధానిగా వేమన శతకంపై పన్నెండు మంది పృచ్ఛకులతో ద్వాదశ పృచ్ఛక అవధానం జేవీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. గార్లపాటి,బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవధాన కార్యక్రమంలో డిఈఒ సోమశేఖర శర్మ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.కళాశాల విద్యార్థులు ఎనిమిది మంది పృచ్ఛకులు శతకంపై వివిధ అంశాలపై ప్రశ్నలు సంధించారు.అతిథులు సైతం వివిధ అంశాలలో ప్రశ్నలు వేశారు. డిఈఒ సోమశేఖర శర్మ వేమన శతకం లోని అనేక వందల పదాలలో ఒక పదాన్ని చెప్పగా ఆ పదం ఏపద్యంలో ఉందో చెప్పి పూర్తిగా పద్యాన్ని అప్పగించడం సభికులను ఆశ్చర్యపరిచింది.శతక అవధానం అనంతరం కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ వై.మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్తుపల్లి, పెనుబల్లి మండల విద్యాధికారులు రాజేశ్వరరావు, సత్యనారాయణలు మాట్లాడుతూ పట్టుమని పది పద్యాలు చదవడం రాని నేటి పరిస్థితులలో వంద వేమన పద్యాలు చదవడం, రాయడం నేర్చుకోవడమే గొప్ప అన్నారు. వేమన శతకంపై అవధానం చేసి మహమ్మద్ అఫ్రియా అద్భుతాన్ని సృష్టించిందన్నారు.

అఫ్రియా అవధానం తరువాత ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు వంశీ,పోతురాజు తాము కూడా వేమన శతకంపై అవాధానం చేస్తున్న విషయం డిఈఒ కు తెలుపగా శర్మ వారిని ప్రశ్నించి ప్రతిభకు అభినందనలు తెలిపారు.అఫ్రియా, వంశి,పోతురాజులకు ట్రస్ట్ తరపున జ్ఞాపికలతో సత్కరించారు. కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు పూర్ణచంద్రరావు, మాధవి, గార్లపాటి,బొల్లేపల్లి స్మారక ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన రాజు, అఫ్రియా తల్లిదండ్రులు ఉస్మాన్,రబియా,సృజన, పిజీ హెచ్ఎం యాకూబ్,ఆషా,లయన్స్ సంస్థల నిర్వాహకులు వాసు,అయ్యదేవర శేషగిరి, మాదిరాజు మాలతి, రామిశెట్టి శ్రీనివాసరావు, దొడ్డా కృష్ణయ్య,ఉపాధ్యాయులు రమణమూర్తి, రజనీదేవి, రమాదేవి,నర్సయ్య, రమణ,కాశీం,ప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.








# 30న కల్లూరు గూడెంలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన



**సత్తుపల్లి, నవభూమి, మార్చి 28 :** వేంసూర్ మండలం కల్లూరు గూడెం గ్రామంలో మార్చి 30న పామాయిల్ ఫ్యాక్టరీ కి శంకుస్థాపన చేసున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో సత్తుపల్లి నియోజకవర్గం లోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ ముఖ్య కాంగ్రెస్ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ దయానంద మాట్లాడుతూ వేంసూర్ మండలం కల్లూరు గూడెం గ్రామంలో ఆదివారం సాయంత్రం 04:00 గంటలకు ఖమ్మం జిల్లాలోనే తొలి పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు , రైతు సోదరులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మధ్యాహ్నం 3:00 గంటలకు వేంసూరు మండలంలోని మర్లపాడు గ్రామ రింగ్ సెంటర్ నుండి భారీ ర్యాలీ గా కల్లూరుగూడెం లోని పామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు బయలుదేరడం జరుగుతుందన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొంటారన్నారు. ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కృషి,సహకారంతో పామాయిల్ ఫ్యాక్టరీ కి నిధులు మంజూరయ్యాయన్నారు. 450 కోట్ల రూపాయలు తో కల్లూరు మండలం, చెన్నూరు గ్రామం లో ఇంటిగ్రేటెడ్ స్కూల్, వేంసూరు మండలంలో కల్లూరు గూడెం గ్రామంలో పామాయిల్ ఫ్యాక్టరీ సత్తుపల్లి నియోజకవర్గానికి అందించినందుకు ఎంతో గర్వంగా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో నూతన ఐటిఐ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, పాలిటెక్నిక్ కాలేజ్ నిర్మించడం జరుగుతుందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పట్ల వేంసూరు మండలంలో రైతులు మాత్రమే కాకుండా సత్తుపల్లి నియోజకవర్గంలో రైతులందరూ సంతోషంగా ఉన్నారన్నారు. రైతులు తరుపున వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు డాక్టర్ దయానంద్ ధన్యవాదాలు తెలిపారు . నూతన ఇంటికేటెడ్ స్కూల్ అందించినందుకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి డాక్టర్ దయానంద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా అర్హులు గల ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనారిటీ యువతకు సబ్సిడీ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి రుణాలు అందిస్తారన్నారు. యువతకు ఎంతో సహాయం అందుతుందన్నారు. ఎవరిపై ఆధారపడకుండా వారి కాళ్ళ మీద వాళ్లు నిలబడే అవకాశం ఉంటుందన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు జై బాబు, జై భీమ్,జై సంవిధన్ నినాదంతో గ్రామ గ్రామాన పట్టణాల్లో మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను అందించిన హక్కులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

# నమ్మిన సిద్ధాంతం కోసం 4 దశాబ్దాలుగా...

## పదవి ఉన్నా,లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- అనేక పార్టీలు ఆహ్వానించినా పసుపు పార్టీ పై చెక్కు చెదరని అభిమానం
- శ్రమకు ఫలితంగా రాష్ట్ర స్థాయిలో టిడిపి తరపున ఏకైక ఎంపిపిగా గుర్తింపు
- విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు
- మాకు ఆదర్శం అంటున్న అరెం రామయ్య దంపతులు
- తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



**మోదుగు ఆదమ్/ నవభూమి/ జూలురుపాడు-** పవర్ పాలిటిక్స్ నడుస్తున్న కాలం.అధికారం కోసం పూటకొక పార్టీ కండువా మార్చుతున్న కలి కాలం. భార్య ఒక పార్టీ,భర్త మరొక పార్టీ జెండాలు పట్టుకుని తిరుగుతున్న ఆధునిక కాలం.పదవి ఉన్నా లేకున్నా కష్ట నష్టాలను భరిస్తూ నాలుగు దశాబ్దాల పాటు నమ్మిన సిద్ధాంతం కోసం నికార్సుగా పసుపు జెండాను బుజాన వేసుకొని ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న అరుదైన కార్య కర్తల గురించి తెలుసుకుందాం. ఇదీ ఏనుకూరు మండలం ఒంటి గుడిసె గ్రామానికి చెందిన అరెం రామయ్య వరలక్ష్మి దంపతులు స్ఫూర్తి కథనం.ప్రతి ఒక్కరికీ ఇల్లు,వస్త్రం,ఆహారం అందించాలని కార్మికులు,కర్షకులకు చేతినిండా పని,దళిత గిరిజన బలహీన వర్గాలకు పరి పాలన లో సమున్నత రాజకీయ అవకాశాలు కల్పించే లక్ష్యంతో సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళని నమ్మి తెలుగు జాతి ఆత్మ గౌరవం దశ దిశల చాటి విశ్వ వ్యాప్తం చేయాలని1982 మార్చి 29వ తేదీన తెలుగుదేశం పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేజిక్కించుకొని చరిత్ర సృష్టించిన నందమూరి తారక రామారావు పట్ల ఆకర్షితులై రామయ్య తెలుగు దేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.నాటి నుంచి నేటి వరకు మడమ తిప్పని నైజం ఆయన సొంతం.1987 మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో ఆయన రాజకీయ అరంగేట్రం,సాక్షాత్తు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్ ఎన్నికల ప్రచారం తోనే జరిగింది.మారిన కాలమాన,కుటుంబ పరిస్థితుల వలన ప్రభుత్వ ఉద్యోగిగా మారినప్పటికీ ఆయన ధ్యాస శ్వాస ప్రజాసేవే. ఆ కాంక్ష నివురుగప్పిన నిప్పు వలె ఉంది. మూడు దశాబ్దాల తర్వాత తన సతీమణి వరలక్ష్మి ని రాజకీయాలలో ప్రోత్సహించారు.2014 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాచారం ఎం పి టి సి గా గెలుపొందారు. మండలాధ్యక్ష పదవి తృటి లో చేజారిన నిలకడగా ఉండి 2019 లో తిరిగి టి డి పి తరుఫున ఒకే ఒక ఎం పి టి సి గా గెలిచి అనూహ్యంగా కాంగ్రెస్ వామ పక్షాల మద్దతు తో ఎం పి పి పీఠం కైవసం చేసుకుని రికార్డు సృష్టించారు.దీంతో అనేక రాజకీయ పార్టీల చూపు వీరిపై పడి రెడ్ కార్పెట్ పరచి తమ పార్టీల లోకి ఆహ్వానించాయి.అంది వచ్చిన అధికార,ఆర్థిక అవకాశాలను సైతం సున్నితంగా తిరస్కరించారు. తెలుగు దేశం పార్టీ పై వారికున్న అభిమానానికి ప్రబల తార్కాణం. 2018 ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ డిజిట్ కే పరిమితమై రాజకీయంగా వెంటిలేటర్ పై ఉన్న తెలుగు దేశం పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలలో వీరి విజయం ఆక్సీజన్ లా మారి పార్టీకి ఊపిరులూదారు.ఇదే సందర్భంలో పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి దృష్టిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. బదులు గా పార్టీలో వరలక్ష్మి కి తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శిగా,రామయ్య కు జిల్లా పార్టీలో కీలక బాధ్యతలు అప్పజెప్పారు.గత ఎన్నికలలో ఇతర రాజకీయ పార్టీలు వైరా ఎమ్మెల్యే టికెట్ ఇస్తామన్న రామయ్య ఆసక్తి చూపలేదు. తెలుగు దేశం పార్టీ సైకిల్ గుర్తుపై తప్ప వేరే పార్టీకి అవకాశం లేదని ఖరాఖండిగా చెప్పారు.వై సి పి ప్రభుత్వం చంద్ర బాబు ను జైలు పెట్టిన సందర్భంలో రామయ్య ఈ నియోజక వర్గంలో ప్రజాస్వామ్య వాదుల తో కలసి అనేక నిరసన కార్య క్రమాలలో పాల్గొన్నారు. రెండవ సారి ఏ పి లో అధికారంలోకి వచ్చిన సందర్భంలో ఇవన్నీ గమనించిన పార్టీ అధ్యక్షుడు తితిదే పాలక మండలి సభ్యులు గా అవకాశం కల్పిస్తారని ప్రచారం జరిగింది.అమలు జరగలేదు. ఎం పి పి పదవీ కాలం పూర్తి అయిన కూడా ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారి ప్రయత్నాలు వదలక ప్రజా క్షేత్రంలో కొనసాగుతున్నారు.ఈ సందర్భంగా రామయ్య నవ భూమి ప్రతినిధి తో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పైగా చరిత్ర కలిగిన తెలుగు దేశం పార్టీలో కార్యకర్తగా కొనసాగడం సంతృప్తి నిచ్చిందని అన్నారు.పార్టీ కూడా అనేక అవకాశాలు కల్పించిందని కృతజ్ఞతలు తెలిపారు.చంద్రబాబు గొప్ప పరిపాలనాదక్షుడు ఆయన జన్మభూమి, ప్రజల వద్దకే పాలన వంటి కార్య క్రమాలతో జవాబుదారీ తనం కల్పించారని ప్రశంసించారు. తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేశారు.నేటి పరిస్థితులలో ఆయన మార్గదర్శకత్వం అవసరమన్నారు.తన రాజకీయ పయనం తెలుగు దేశం పార్టీ తోనే అన్నారు.టి డి పి కి కార్యకర్తలే బలమన్నారు. నాలుగు దశాబ్దాలు గా పార్టీని కంటికి రెప్పలా కాపాడు కుంటున్న కార్య కర్తలకు అభినందనలు తెలిపారు.పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ సిద్ధాంతాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ లో రానున్న కాలం తెలుగుదేశం పార్టీదేనని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలియ జేశారు.పార్టీ పట్ల ఆరేం దంపతుల విధేయతకు పట్టం కట్టే అవకాశాలు రావాలని కోరుకుందాం.